క్లుప్తంగా

వైఎస్సార్ టీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్



కందుకూరు: వైఎస్సార్ టీపీ జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా మండలంలోని రాచులూరుకు చెందిన చిట్టి శ్రీకాంత్ నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర యువజన విభాగం చీఫ్ కోఆర్డినేటర్ గడ్డం ఇందుజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎడమ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చిన పార్టీ అధ్యక్షురాలు షర్మిలతో పాటు తనకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి



మంత్రి సబితారెడ్డితో మీర్‌ఖాన్‌పేట వాసులు, సంఘం నేతలు

కందుకూరు: సమస్యలు పరిష్కరించాలంటూ మండలంలోని మీర్‌ఖాన్‌పేట ప్రజలు, సర్పంచ్ బ్రాహ్మణపల్లి జ్యోతి, ఎంపీటీసీ కాకి రాములు ఆధ్వర్యంలో గురువారం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేశారు. పందుల పెంపకానికి స్థలం కేటాయించాలని ఏకలవ్య సంఘం నాయకులు మంత్రిని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల జనార్దన్, కాకి రవీందర్ ముదిరాజ్, బొమ్మరాజు జంగయ్య, కాకి నవీన్, నందిగామ చంద్రశేఖర్, జెలా మహేందర్, ఎరుకల సంఘం సభ్యులు కుతాటి పెద్ద జంగయ్య, కూతాటి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవాల్లో నట్టల నివారణకు మందు వాడాలి



గూడూరులో జీవాల రికార్డులను పరిశీలిస్తున్న అంజిలప్ప

కందుకూరు: గొర్రెలు, మేకల్లో నట్టల నివారణకు మందు వాడాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ అంజిలప్ప రైతులకు సూచించారు. గురువారం మండలంలోని గూడూరులో గొర్రెలు, మేకలకు వేస్తున్న నట్టల నివారణ మందు కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంజిలప్ప మాట్లాడుతూ.. జీవాలు వ్యాధుల బారిన పడకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్త వహిస్తూ మందులు, టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ రేవతి, సిబ్బంది మాధవి, ఆంజనేయులు, రైతులు శ్రీశైలం, సురేష్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

శునకాలను పట్టే పనిలో సిబ్బంది



రాఘవేంద్ర కాలనీలో కుక్కలను పట్టుకెళుతున్న మున్సిపల్ సిబ్బంది

బడంగ్‌పేట్: ఎట్టకేలకు శునకాలను పట్టే పనిలో మున్సిపల్ సిబ్బంది నిమగ్నమైంది. కమిషనర్ ఆదేశాలతో అన్ని కాలనీల్లో కుక్కల బెడదను తప్పించేందుకు రంగం సిద్ధం చేశారు. శునకాలను పట్టేందుకు సిబ్బందిని రప్పించారు. గురువారం కార్పొరేషన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో స్థానిక కార్పొరేటర్ రాళ్లగూడెం సంతోషి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రోడ్లపై తిరుగుతున్న కుక్కలను పట్టుకున్నారు. ఇప్పటికైనా అధికారులు కుక్కలను పట్టుకునేందుకు ముందుకురావడం సంతోషంగా ఉందని కాలనీ వాసులు తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారి వంకాయల యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సంత్ గాడ్గే బాబా జయంతి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో బహుజన సేన ఆధ్వర్యంలో గురువారం సామాజిక, ఆధ్యాత్మిక బహుజన ఉద్యమ యోధుడు సంత్ గాడ్గే బాబా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంత్ గాడ్గే బాబా చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బహుజనసేన జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ వర్కాల శేఖర్, హ్యూమన్ రైట్స్‌క్లబ్ జిల్లా ఆర్గనైజర్ కొమ్ము తిరుపతి, సింగంపల్లి సర్పంచ్ ప్రేమలత, నాయకులు నర్సింహ, ఉప్పల రాములుపాల్గొన్నారు.

నడకే ఆరోగ్యం

- మార్నింగ్ వాక్‌కు ప్రాధాన్యత ఇస్తున్న సిటిజన్స్
- వీఎంహోం గ్రౌండ్‌లో పెద్ద సంఖ్యలో వ్యాయామాలు
- ఆహార నియమాలు పాటించాలంటున్న వైద్యులు



వీఎంహోం ఆవరణలో వాకింగ్ చేస్తున్న యువత, వృద్ధులు

హుడాకాంప్లెక్స్: జీవనశైలి యాంత్రికంగా మారిన ప్రస్తుత కాలంలో ఉదయం నిద్ర లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు అంతా ఉరుకులు పరుగులే.. జీవన విధానంలో నిత్యం ఒత్తిడి ఎదుర్కొంటున్న ఉద్యోగులు.. విశ్రాంత జీవితం సాఫీగా గడపాలని కోరుకుంటారు. తేలికపాటి వ్యాయామం, నడక, కొద్దిపాటి బరువులెత్తడం వల్ల మానసిక ఒత్తిడి, అలసట నుంచి ఉపశమనం పొందవచ్చని అధ్యయనాల్లో వెల్లడైన నేపథ్యంలో ప్రతిరోజు ఉదయం పూట నడకకు వెళ్లేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. కనీసం 30 నిముషాల పాటు శారీరక శ్రమ చేస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని పరిశోధన సంస్థలు అధ్యయనంలో వెల్లడైన విషయం తెలిసిందే. దీంతో ముఖ్యంగా వృద్ధులు క్రమం తప్పకుండా నడకకు వెళ్లడానికి ఆసక్తి చూపుతున్నారు. ఎక్కువగా శారీరక శ్రమ చేయలేనందున నడకకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సరూర్‌నగర్ మండల కేంద్రంలోని విక్టోరియా మెమోరియల్ హోం గ్రౌండ్‌లో వేలాది మంది మార్నింగ్ వాక్‌కు వస్తుంటారు. వీరిలో ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, యువకులు ఉంటున్నారు.

నడకతో రోగాలు దరిచేరవు..

గ్రామీణ ప్రాంతంలోని వృద్ధులు వ్యాయామం కన్నా ఇంటి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వ్యవసాయం పొలాలకు వెళ్లడం, ఇక పదవీ విరమణ పొందిన పట్టణ ఉద్యోగులు నిత్యం ఉదయం నడకతో అనారోగ్యం బారినుంచి బయటపడుతున్నారు. నడకతో శరీరంలో రక్త సరఫరా మెరుగుపడి అన్ని అవయవాలు చురుగ్గా పనిచేయడానికి తోడ్పడతాయన్న విషయాన్ని గ్రహించి ఇందుకు ఎక్కువ సమయాన్ని కేటాయిస్తున్నారు. వీఎంహోం మైదానంలో ఆహ్లాద వాతావరణం ఉండటంతో ఇక్కడికి అధిక సంఖ్యలో స్థానికులు వాకింక్‌కు వస్తారు. ప్రతి రోజు ఉదయం లేదా సాయంత్రం వేళల్లో అరగంట పాటు నడవడం ద్వారా శరీరంలో చురుకుదనం, మానసిక ఉల్లాసం కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

రోజూ 30 నిమిషాలు నడుస్తా



ప్రతి ఒక్కరూ రోజులో 30 నిమిషాలు వాకింగ్‌చేస్తే కీళ్లు బలంగా మారి నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. వీఎంహోం గ్రౌండ్‌లో విశాలమైన స్థలం, పచ్చని చెట్లు, బాల్యమిత్రులతో కలిసి వాకింగ్ చేయడం ఆనందంగా ఉంటుంది. ఎంత పనిఒత్తిడి ఉన్నా ఏదో ఓ రకంగా నడిచేందుకు వీలుండేలా చూసుకుంటా.

– బాలకిషన్, హుడాకాంప్లెక్స్

నడకకు ప్రాధాన్యం ఇవ్వాలి



మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. ఆరోగ్యంగా ఉండాలంటే నడకకు ప్రాధాన్యత ఇవ్వాలి. వాకింగ్‌తో పాటు ఆహారం విషయంలో నియమాలు పాటించాలి. మధుమేహం, గుండెజబ్బులు, బీపీ వంటి జబ్బులు రాకుండా నివారించటానికి వాకింగ్ చక్కటి పరిష్కారం.

– డాక్టర్ ప్రభాకరాచారి, విశ్రాంత ప్రభుత్వ గుండె వైద్య నిపుణులు

పర్యాటక కేంద్రంగా రాజేశ్వరాలయం



మంత్రి సబితకు ప్రసాదం అందజేస్తున్న ఆలయ చైర్మన్ సుధీర్ గౌడ్, డైరెక్టర్లు, ఈఓ, పూజారులు

- పురాతన ఆలయ అభివృద్ధికి కృషి
- విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయ చైర్మన్, డైరెక్టర్లు, అధికారి, పూజారులు మంత్రిని ఆమె నివాసంలో కలిసి స్వామివారి ప్రసాదం అందజేసి, కండువాను బహూకరించారు. ఈ సందర్భంగా మంత్రి సబిత మాట్లాడారు. కాకతీయులు శివాలయం నిర్మించడం గర్వించదగ్గ విషయమని, గంగలో శివాలయం, చుట్టూ బ్రహ్మ కమలం వలే పదహారు శివాలయాలు కొలువుదీరడం చాలా అరుదని ఆమె చెప్పారు.

పర్యాటక కేంద్రంగా..

రాజరాజేశ్వర ఆలయంలో మౌలిక వసతులు కల్పించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి సబితారెడ్డి చెప్పారు. ఆలయం, గడికోటను అభివృద్ధి చేసి, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిధులతో పురాతన ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించిన ఆలయ చైర్మన్, డైరెక్టర్లను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, ఈఓ మురళీ కృష్ణ, డైరెక్టర్లు మిద్దింటి బాలరాజ్, కటికల మహేందర్, ప్రధాన పూజారి వీరేశం, ఆలయ మాజీ చైర్మన్ మునగపాటి నవీన్, బీఆర్‌ఎస్ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షుడు కృష్ణ, గ్రామ కోఆప్షన్ సభ్యుడు రమేష్, నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం 11కేవీ కొహెడ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్‌రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మేనల్లుడికి గుండెపోటు

చికిత్స పొందుతూ మృతి



జీవన్‌రెడ్డి (ఫైల్)

సైదాబాద్: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మేనల్లుడు జీవన్‌రెడ్డి (47) గుండెపోటుతో హఠా న్మరణం చెందారు. ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీలో నివసించే కిషన్‌రెడ్డి సోదరి లక్ష్మమ్మ, నర్సింహారెడ్డి దంపతుల కుమారుడు జీవన్‌రెడ్డి విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం ఆరు గంటల సమయంలో ఇంటిలో ఉన్న ఆయన గుండెపోటుకు గురికావడంతో కుటుంబసభ్యులు సంతోష్‌నగర్‌లోని డీఆర్‌డీఎల్ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య ఉమ, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి వారి నివాసానికి వెళ్లి ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

పేదలకు వరం ‘ఆయుష్మాన్ భారత్’

కందుకూరు: ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ పథకం పేదలకు వరమని కొత్తగూడ సర్పంచ్ సాధ మల్లారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కొత్తగూడ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో ఆయుష్మాన్ భారత్ పథకంలో గ్రామస్తులను చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యం పాలైనప్పుడు ఆస్పత్రుల్లో అయ్యే ఖర్చులకు సంబంధించి రూ. 5లక్షల వరకు ఈ పథకంలో ప్రయోజనాలు అందుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పథకంలో చేరాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు అంజయ్య, కృష్ణయ్య, నాయకులు బాలేష్ ముదిరాజ్, సురేష్, పంచాయతీ కార్యదర్శి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్: ఆయుష్మాన్ భారత్‌లో చేరుతున్న బాలాపూర్ వాసులు

సద్వినియోగం చేసుకోండి

బడంగ్‌పేట్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బాలాపూర్ కార్పొరేటర్ ఎర్ర మహేశ్వరి సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్ పథకంలో రూ. 50 చెల్లిస్తే జీవిత ప్రమాద బీమాకు అర్హులన్నారు. లబ్ధిదారుడు మరణిస్తే బీమా సొమ్ము రూ. 5 లక్షలు కుటుంబానికి అందుతుందన్నారు. బాలాపూర్‌లో ఏడు వందల మందికి రూ. 50 చొప్పున తానే చెల్లించి బీమా వర్తించేలా చేశామని కార్పొరేటర్ మహేశ్వరి తెలిపారు. శుక్రవారం వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఈ శిబిరం ఉంటుందని తెలిపారు. ఆధార్ కార్డు, తెల్ల రేషన్‌కార్డు ఉన్నవారు మాత్రమే అర్హులన్నారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, 17 డివిజన్ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

15వ డివిజన్‌లో ‘కంటి వెలుగు’



కంటి అద్దాలు అందజేస్తున్న మేయర్ దుర్గ

మీర్‌పేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ ఎం దుర్గ చౌహాన్ సూచించారు. గురువారం 15వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మేయర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. మంత్రి సబితారెడ్డి ఆదేశాల మేరకు కార్పొరేషన్‌లోని డివిజన్లలో కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు అత్యాధునిక పరికరాలతో కంటి సంబంధిత పరీక్షలు చేయిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు హారతి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, సూపర్‌వైజర్ కృష్ణ, సూపర్‌వైజర్ రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న బాబు

మహేశ్వరం: మహేశ్వరం ప్రభుత్వ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా అదే స్కూల్‌లో సీనియర్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన బి.ధనుంజయ్ దీర్ఘకాల సెలవుపై వెళ్లడంతో ఉన్నతాధికారులు బాబును ప్రిన్సిపాల్‌గా నియమించారు. బాబు మాట్లాడుతూ.. తోటి ఉపాధ్యాయులందరినీ సమన్వయం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషిచేస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించిన ఉన్నతాధికారులతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఖదీర్‌ఖాన్ సతీమణికి నగదు అందజేస్తున్న జల్‌పల్లి బీఆర్‌ఎస్ నాయకులు

పహాడీషరీఫ్: మెదక్ పోలీసుల లాఠీ దెబ్బలతో మృతి చెందిన మహ్మద్ ఖదీర్‌ఖాన్ కుటుంబ సభ్యులకు బీఆర్‌ఎస్ జల్‌పల్లి మున్సిపల్ నాయకులు రూ. 20వేల ఆర్థిక సాయం అందజేశారు. మెదక్‌లోని ఖదీర్‌ఖాన్ ఇంటికి వెళ్లి ఆయన సతీమణికి పార్టీ నాయకులు మహ్మద్ హామెద్, అబ్దుల్ రవూఫ్, షాకీర్, అంజద్‌ఖాన్ మనోధైర్యం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఖదీర్‌ఖాన్ మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. మృతుని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, డబుల్ బెడ్‌రూం ఇల్లు కేటాయించాలన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

వేడుకగా స్వర్ణ రథం, స్వర్ణ యంత్ర స్థాపన ఉత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి ఆలయంలో గురువారం దేవాలయ ముఖ ద్వారం, స్వర్ణ రథం అవిష్కరణ, ప్రధాన సన్నిధిలో శ్రీమహాలక్ష్మి స్వర్ణ యంత్ర స్థాపన ఉత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు అష్టలక్ష్మి ఆలయ కమిటీ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా తెలిపారు. ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి హాజరవుతారన్నారు. గురువారం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... ఆలయంలో స్వాగతం ముఖ ద్వారం, స్వర్ణ రథం ఆవిష్కరణ, ప్రధాన సన్నిధిలో శ్రీ మహాలక్ష్మి స్వర్ణ యంత్ర స్థాపన అనంతరం దేవాలయ కల్యాణ మండప ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి గంప జగన్, కోశాధికారి ఐత అంజయ్య గుప్తా, ఉపాధ్యక్షుడు సోమా సురేష్, కాలనీ నేతలు చిలుక ఉపేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఉమాపతి, మాలే అనిల్, తమన్నా శ్రీధర్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 19, వంకాయ 13, బెండ 50, పచ్చి మిర్చి 35, కాకర 35, బీర 50, క్యాబేజి 10, ఫ్రెంచిబీన్స్ 40, క్యారెట్ 18, దొండ 23–27, చిక్కుడు 35, గోకర 45, బీట్‌రూట్ 15, క్యాప్సికం 48, ఆలు 19, దోస 28, సొర 13, పొట్ల 18, ఉల్లి 14, చామగడ్డ 70 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న బీజేపీ నాయకులు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని మంఖాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు బీజేపీ తుక్కుగూడ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్ యాదవ్ గురువారం ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్షిక పరీక్షలకు సమయం తక్కువగా ఉన్నందున విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింగ్ రాజు, బోగరాజు బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయండి

కమిషనర్‌కు ఏఐటీయూసీ నేతల వినతి

తుర్కయంజాల్: తుర్కయంజాల్ చౌరస్తాలో లేబర్ అడ్డా వద్ద పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో కూలీపనుల కొరకు అడ్డాకు వచ్చే కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి యాదయ్య తెలిపారు. గురువారం మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. లేబర్ అడ్డా వద్ద కూలీపనుల కొరకు వచ్చే మహిళల పరిస్థితి మరీ దారుణంగా ఉందని, వెంటనే స్పందించి అక్కడ మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మున్సిపాలిటీ సహాయ కార్యదర్శి పి.శివకుమార్, బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) సభ్యులు సుందరమ్మ, దీప్లా పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివి

హయత్‌నగర్ సర్కిల్ డీసీ మారుతీ దివాకర్

- ఘనంగా ‘స్వచ్ఛ బాబా’ సంత్ గాడ్గే జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీ మారుతీ దివాకర్

వనస్థలిపురం: ప్రజల ఆరోగ్య సంరక్షణలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికుల సేవలు ఎనలేనివని, ముఖ్యంగా కరోనా మహమ్మారి విజృంభిస్తున్న సమయంలో వారు తమ ప్రాణాలను పణంగా పెట్టి పారిశుద్ధ్య పనులు నిర్వహించారని జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డీసీ మారుతీ దివాకర్ కొనియాడారు. గ్రామ్ స్వచ్ఛత అభియాన్ కార్యక్రమంలో భాగంగా జీహెచ్‌ఎంసీ, జాగృతి అభ్యుదయ సంఘం సంయుక్తాధ్వర్యంలో ‘స్వచ్ఛ బాబా’ సంత్ గాడ్గే బాబా జయంతిని పురస్కరించుకుని గురువారం వనస్థలిపురం శారదానగర్‌లో పరిశుభ్రత–ఆరోగ్య పరిరక్షణ–వ్యక్తిగత బాధ్యత అంశంపై డాక్యుమెంటరీ ప్రదర్శన, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంత్ గాడ్గే బాబా జీవితంపై సినీ దర్శకులు (లక్ష్మణ రేఖ ఫేం) నెట్టెల గోపాలకృష్ణ దర్శకత్వంలో రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీసీ మాట్లాడుతూ... మహారాష్ట్రలో జన్మించిన సంత్ గాడ్గే బాబా స్వచ్ఛ భారత్‌కు స్ఫూర్తిప్రదాత అని అన్నారు. గాడ్గే బాబా సన్యాసిగా మారి భిక్షాటన చేస్తూ గ్రామాలలో చీపురు దండులను ఏర్పాటు చేసి స్వచ్ఛ భారత్‌కు మార్గదర్శకులయ్యారని ఆయన గుర్తు చేశారు. ఆయన భిక్షాటనకు గాడ్గే (మూకుడు) వాడేవారని, అందుకే గాడ్గే బాబాగా పేరు వచ్చిందన్నారు. గాడ్గే బాబా, మెహర్‌బాబాలు కలసి కుష్ఠురోగులకు సేవలు అందించేవారని, తమ భక్తులు ఇచ్చిన విరాళాలతో పేద పిల్లల కోసం విద్యాలయాలు ఏర్పాటు చేశారని అన్నారు. సీఎంహెచ్‌ఓ పద్మజ మాట్లాడుతూ... పర్యావరణాన్ని కాలుష్యం కాకుండా చూసుకుంటూ పుడమిని కాపాడు కోవాలని సూచించారు. కాలుష్యం వల్ల కేన్సర్, థైరాయిడ్, గుండె జబ్బులు తదితర రుగ్మతలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ రక్షణపై పాట పాడి అందరిని అలరించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్యుమెంటరీ నిర్మాత తిరుమల వెంకటస్వామి, గాడ్గే బాబా పాత్రధారి మదన్‌గుప్తా, నాగేశ్వర్‌రావు, కె.ఎల్.నర్సింహారావు, సి.హెచ్.వి.ఆర్.కె.మూర్తి, గోపాలదాస్ రాము, శ్రీరంగనాథ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అజీముద్దీన్, జవాన్లు, ఎస్‌ఎఫ్‌ఏలు, కార్మికులు పాల్గొన్నారు.



హాజరైన పారిశుద్ధ్య కార్మికులు